ఈనాడు
epaper.eenadu.net

# నెలాఖరుకల్లా మెట్రో ప్రభుత్వ పరం!

- రూ.13,615 కోట్ల రుణం ఇవ్వడానికి ఐఆర్‌ఎఫ్‌సీ అంగీకారం
- స్వాధీన ప్రక్రియపై మంత్రివర్గ సమావేశంలో చర్చ.. ఆమోదం

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ మెట్రోరైలు మొదటి దశలో కీలక పరిణామం. మొదటిదశ స్వాధీన ప్రక్రియలో కీలకమైన దాదాపు రూ.13,615 కోట్ల రుణం ఇవ్వడానికి ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్(ఐఆర్‌ఎఫ్‌సీ) అంగీకరించగా ఇందుకు సంబంధించిన ఒప్పందానికి, డాక్యుమెంట్‌కు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీంతో ఈ నెల 30 నాటికి మెట్రోరైలు ప్రభుత్వ పరం కావడానికి మార్గం సుగమమైంది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం(పీపీపీ)లో చేపట్టిన ఈప్రాజెక్ట్‌ను ప్రస్తుతం ఎల్‌అండ్‌టీ ఎంఆర్‌హెచ్‌ఎల్ నిర్మించి నిర్వహిస్తోంది. స్వాధీన ప్రక్రియతో ముడిపడి ఉన్న పలు అంశాలు, మంత్రివర్గ ఉపసంఘం చేసిన అనేక సిఫార్సులను గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో చర్చించి ఆమోదం తెలిపారు. మెట్రోరైలు ప్రాజెక్ట్ మొదటి దశ టేకోవర్‌కు సంబంధించి షేర్ పర్చేజ్ అగ్రిమెంట్, ఐఆర్‌ఎఫ్‌సీ నుంచి రుణం, రాష్ట్ర ప్రభుత్వం నుంచి అండర్‌టేకింగ్ లేఖ, ప్రభుత్వ గ్యారంటీ తదితర అంశాలను మంత్రివర్గ సమావేశంలో చర్చించారు.

## 20 ఏళ్ల కాలవ్యవధిలో తిరిగి చెల్లింపు

ఐఆర్‌ఎఫ్‌సీ ఇచ్చే దాదాపు రూ.13,615 కోట్ల రుణాన్ని



20 ఏళ్ల కాలవ్యవధిలో మెట్రో రైలు తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. దీనికి ప్రభుత్వం కూడా పూచీకత్తు ఇవ్వడానికి అంగీకరించింది. గతంలో ఐఆర్‌ఎఫ్‌సీ అంగీకరించిన రూ.12,750 కోట్ల రుణం కంటే తాజాగా అంగీకరించింది ఎక్కువ. 'ఈ రుణాన్ని పొందడానికి ఐఆర్‌ఎఫ్‌సీ, హెచ్‌ఎంఆర్‌ఎల్, ఎల్‌అండ్‌టీ ఎంఆర్‌హెచ్‌ఎల్ మధ్య ట్రై పార్టీ అగ్రిమెంట్ అవసరం. తెలంగాణ ప్రభుత్వం గ్యారంటీకి సంబంధించి లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్ కూడా అందించాలి' అని ఐఆర్‌ఎఫ్‌సీ సూచించింది. బడ్జెట్ మద్దతు కూడా ఉండాలని పేర్కొంటూ ఆ నిబంధనలను ఐఆర్‌ఎఫ్‌సీ ముసాయిదా టర్మ్‌షీట్‌లో పొందుపర్చింది. ఈ నిబంధనలను తొలగించాలని ప్రభుత్వం తరఫున హెచ్‌ఎంఆర్‌ఎల్ ఎండీ కోరడంతో ఐఆర్‌ఎఫ్‌సీ అంగీకరించింది.

➡ మెట్రో మొదటిదశను రూ.15 వేల కోట్ల వ్యయంతో(అప్పుతో కలిపి) ఎల్‌అండ్‌టీ ఎంఆర్‌హెచ్‌ఎల్ నుంచి ప్రభుత్వం తీసుకోదానికి నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందులో రూ.13 వేల కోట్ల రుణాలు, రూ.2 వేల కోట్ల ఈక్విటీ ఉంది. 100 శాతం ఈక్విటీ వాటాతో షేర్ పర్చేజ్ అగ్రిమెంట్ ద్వారా ప్రభుత్వం టేకోవర్ చేసుకోబోతోంది. ఇందుకు లావాదేవీ తేదీని ఈ నెల 30గా నిర్ణయించింది. ఐఆర్‌ఎఫ్‌సీ రుణంగా ఇవ్వగా మిగిలిన మొత్తాన్ని హెచ్‌ఎండీఏ సమకూర్చనుంది. ఈ మొత్తం తక్షణం అందజేస్తేనే గడువులోగా లావాదేవీ పూర్తవుతుందని హెచ్‌ఎంఆర్‌ఎల్ ప్రభుత్వాన్ని కోరింది. ఇవన్నీ కూడా మంత్రివర్గంలో చర్చించారు.

## ఏడాది పాటు ఎల్‌అండ్‌టీ ఉద్యోగుల కొనసాగింపు...

మెట్రోస్వాధీనం తర్వాత నిర్వాహణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఎల్‌అండ్‌టీ ఎంఆర్‌హెచ్‌ఎల్ ఉద్యోగులు 115 మందిని ఏడాది పాటు కొనసాగించాలని నిర్ణయించింది. ఇందుకు అయ్యే వేతనాల ఖర్చు రూ.24.3 కోట్లు హెచ్‌ఎంఆర్‌ఎల్ భరించాలని నిర్ణయించింది. మెట్రో కార్యకలాపాలపై సూచనలు, సలహాల కోసం 6 నెలల కాలానికి ఎల్‌అండ్‌టీకి చెందిన సీనియర్ ఎక్స్‌పీరియన్స్ అధికారి స్థాయిలోని ఏడుగురి సేవలను పొందాలని నిర్ణయించారు. ఇందుకు అయ్యే ఖర్చు ఎల్‌అండ్‌టీ భరిస్తుంది.

➡ లావాదేవీ ముగింపు తేదీ (2026, ఏప్రిల్ 30) తర్వాత అంటే మే 1- జూన్ 1 మధ్య గడువు తీరే కమర్షియల్ పేపర్స్‌పై రూ.10.47 కోట్ల వడ్డీని తెలంగాణ ప్రభుత్వం భరించాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది.

## మంత్రివర్గ ఉపసంఘం చేసిన సిఫార్సులు

➡ ఎల్‌అండ్‌టీకి ప్రభుత్వం గతంలో రూ.900 కోట్ల వడ్డీలేని రుణం అందజేసింది. ఏప్రిల్ 30 నాటికి దీని నికర ప్రస్తుత విలువ(ఎన్‌పీవీ) రూ.366.92 కోట్లు. ప్రాజెక్ట్‌ను టేకోవర్ చేసుకోవాలని నిర్ణయించిన రూ.15 వేల కోట్ల నుంచి ఈ మొత్తాన్ని మినహాయించాలని మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సు చేసింది. ఐడీబీఐ క్యాపిటల్ మూడు సూచనలు చేయగా.. మొదటిదాని వైపు ఉపసంఘం మొగ్గుచూపింది. గడువు తీరే వరకు ఎల్‌అండ్‌టీ ఖాతాలో బకాయి రుణంగా కొనసాగించేందుకు నిర్ణయించింది.

➡ జీహెచ్‌ఎంసీకి చెల్లించాల్సిన ఆస్తి పన్ను బకాయిల విషయంలో ఎల్‌అండ్‌టీ నుంచి ఇండెమ్నిటీ అవసరం లేదని చెప్పింది.

➡ స్టాంప్‌లు, రిజిస్ట్రేషన్ శాఖకు బకాయిపడిన రూ.123.95 కోట్లు, కార్మికశాఖకు చెల్లించాల్సిన లేబర్ సెస్ రూ.163.74 కోట్లు, ఎస్పీడీసీఎల్‌కు కట్టాల్సిన టారిఫ్ బకాయిలు రూ.15.38 కోట్లు, జీహెచ్‌ఎంసీకి ప్రకటనల పన్నులకు సంబంధించి ఇవ్వాల్సిన రూ.75.15 కోట్లకు ఇండెమ్నిటీని ఎల్‌అండ్‌టీ నుంచి తీసుకోవాలని సిఫార్సు చేసింది. పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసుల్లో ఎల్‌అండ్‌టీ ప్రాతినిధ్యం వహించడానికి స్పెసిఫిక్ పవర్ ఆఫ్ అటార్నీ తీసుకోవాలని సూచించింది.

➡ చట్టపరమైన మార్పులతో వచ్చే క్లెయిమ్‌లను తెలంగాణ ప్రభుత్వం, భారత ప్రభుత్వం ఖరారు చేసిన వెంటనే తదుపరి చర్యలు తీసుకునేలా కమిటీ చేసిన ప్రతిపాదనను ఉపసంఘం అంగీకరించింది. రూ.254 కోట్ల సర్దుబాటు వ్యయ నిధి క్లెయిమ్‌లు, జీఎస్‌టీ క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయి.

Date : 24/04/2026 EditionName : GREATER HYDERABAD PageNo :